సాక్షి
ములుగు
శనివారం । 8 । ఫిబ్రవరి । 2025

గరిష్టం/కనిష్టం
34.0⁰ /18.0⁰

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ, ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.


ప్రధాన ఆలయంపై మెట్లమార్గం

కలశాలల్లో గోదావరి జలాలను తీసుకొస్తున్న అర్చకులు


ఆధ్యాత్మిక శిఖరం.. కాళేశ్వరం

మహాకుంభాభిషేక సంప్రోక్షణ పూజలు శుక్రవారం కాళేశ్వరంలో వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. 42ఏళ్ల తర్వాత మహాకుంభాభిషేకం నిర్వహిస్తుండడంతో తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. 50 మంది రుత్వికులు ప్రత్యేక పూజాకార్యక్రమాల తంతును నిర్వహించారు. దీంతో కాళేశ్వరాలయానికి ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

- కాళేశ్వరం

- వివరాలు 8లో▸


యాగశాలలో పూజా తంతు నిర్వహిస్తున్న అర్చకులు

న్యూస్‌రీల్

సకాలంలో జాతర పనులు పూర్తి చేయాలి



ఏటూరునాగారం: కొండాయి, దొడ్ల ప్రాంతాల్లో జరిగే మినీ జాతర పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆర్డీఓ నేత వెంకటేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొండాయిలోని గోవిందరాజుల గుడిలో ఆర్డీఓ, డీడీ పోచం కలిసి పూజలు చేశారు. అనంతరం జాతర జరిగే ప్రాంతాలను, భక్తులు ఎంత మంది వస్తారని సారలమ్మ పూజారి కాక వెంకటేశ్వర్లను అడిగి తెలుసుకున్నారు. జాతర ప్రాంతాల్లో నిర్మిస్తున్న ప్రహరీ, షెడ్లు, తాగునీటి వసతి, విద్యుత్ పనులను సకాలంలో పూర్తి చేసి భక్తులకు అందుబాటులో తీసుకురావాలన్నారు. రోడ్డుపై ఎక్కడ కూడా గుంతలు లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ జగదీష్, ఐటీడీఏ ఏఓ రాజ్‌కుమార్, ఎంపీఓ కుమార్, పంచాయతీ కార్యదర్శి సతీష్, గోవిందరాజుల పూజారి దబ్బగట్ల గోవర్ధన్, రాజారాం, రఘు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



మంగపేట: మండలంలోని బోరునర్సాపురం శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఈ నెల 4 నుంచి కొనసాగుతున్న 18వ వార్షికోత్సవాల చివరి రోజు సందర్భంగా ఉదయం సంక్షేప రామాయణం, ఆదిత్య హృదయం హోమం పూజలను నిర్వహించారు. అనంతరం సీతారాముల ఉత్సవ మూర్తుల కల్యాణం వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు మంగపేట, చెరుపల్లి, కమలాపురం తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నర్రా శ్రీధర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక క్వారీల నిర్వహణకు డీఎల్ఎస్సీ నిర్వహించాలి



ఏటూరునాగారం: గిరిజన సొసైటీ క్వారీల నిర్వహణకు డీఎల్ఎస్సీ నిర్వహించాలని ఇసుక సొసైటీల అధ్యక్షుడు ఈసం రాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో గిరిజన సొసైటీ సభ్యులు, నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్ డీఎల్ఎస్సీ నిర్వహించకుండా ఉండడంతో క్వారీలు నడవడం లేదన్నారు. ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం(కె) మండలంలోని వివిధ గ్రామాల ఇసుక సొసైటీలను గిరిజనేతరలకు అప్పగించడం విడ్డూరంగా ఉందన్నారు. పట్టా భూములకు ఎలాంటి ఫారెస్టు అనుమతి అవసరం లేదన్నారు. డీఎల్ఎస్సీ నిర్వహించి క్వారీలకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో దబ్బగట్ల సుమన్, బుచ్చయ్య, సుభద్ర, నాగబాబు, నర్సింగరావు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ఆందోళన



వాజేడు: మండల పరిధిలోని పెనుగోలు కాలనీలో సోలార్ సిస్టం ద్వారా ఏర్పాటు చేసిన మోటారు కాలిపోయింది. దీంతో తమకు తాగునీరు వసతి కల్పించాలని కోరుతూ పెనుగోలు కాలనీ గిరిజనులు ఖాళీ బిందెలతో శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనులు మాట్లాడుతూ సోలార్ సిస్టం ద్వారా ఏర్పాటు చేసిన మోటారు కాలిపోయి నెలరోజులు అవుతున్నా.. అధికారులు మరమ్మతు చేయడం లేదని ఆరోపించారు. ఉదయం, సాయంత్రం మిషన్ భగీరథ, గ్రామ పంచాయతీ నీరు వస్తున్నప్పటికీ అవి తాగడం లేదన్నారు. సోలార్‌సిస్టం ద్వారా సరఫరా అవుతున్న నీరు పెనుగోలు కాలనీ గ్రామస్తులకే కాకుండా మండల కేంద్రంలోని నాగారం, జంగాలపల్లి, వాజేడు గ్రామాలకు చెందిన ప్రజలు తీసుకు వెళ్లి తాగుతుంటారు. అయితే సోలార్ సిస్టం ద్వారా నడిచే మోటారు స్థానికంగా మరమ్మతు చేయడం కుదరదని, తప్పనిసరిగా హైదరాబాద్‌కు తీసుకెళ్లి మరమ్మతు చేయించాల్సి ఉంటుందని తెలిసింది.

మూడు జోన్లు, 21 సెక్టార్లు

మేడారంలో ప్రత్యేక పారిశుద్ధ్య సేవలు
- 30 మినీ డంపింగ్ కేంద్రాల ఏర్పాటు
- చెత్త ఏరివేతకు 400 మంది కార్మికులు


పారిశుద్ధ్య పనులకు సిద్ధంగా ఉన్న కార్మికులు


స్నానఘట్టాలపై మట్టిని తొలగిస్తున్న కార్మికులు


మేడారంలో ఏర్పాటు చేసిన మినీ డంపింగ్ కేంద్రం

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క సారలమ్మ మినీ జాతరకు ఇంకా నాలుగు రోజులే మిగిలింది. జాతరకు సుమారు 20 లక్షల మంది భక్తులు హాజరవుతారని అధికారుల అంచనా. మేడారానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఆటంకం కాకుండా జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టింది. ఇప్పటికే ముందస్తుగా మేడారంలో పారిశుద్ధ్య పనులు కొనసాగుతుండగా జాతర నాలుగు రోజులు ఎక్కడా కూడా పారిశుద్ధ్య సమస్యల తలెత్తకుండా డీపీఓ దేవరాజు ప్రత్యేక చర్యలకు కసరత్తు చేస్తున్నారు.

సెక్టార్ల వారీగా కార్మికులు..
మేడారం మినీజాతరలో పారిశుద్ధ్య పనుల కోసం మూడు జోన్లు, 21 సెక్టార్లు ఏర్పాటు చేశారు. జంపన్నవాగు, అమ్మవార్ల గద్దెల కోర్ ఏరియా, ఊరట్టం కన్నెపల్లి ఈ మూడు జోన్లలో 21 సెక్టార్లను ఏర్పాటు చేశారు. ఈ సెక్టార్ల వారీగా పారిశుద్ధ్య కార్మికులకు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు చెత్తను సేకరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 10 ట్రాక్టర్లలో చెత్తను డంపింగ్ కేంద్రాలను తరలించనున్నారు. చెత్త పూడ్చివేతకు రెండు జేసీబీలు, రెండు డోజర్లను ప్రత్యేకంగా అందుబాటులో ఉంచనున్నారు. ఈ సెక్టార్లలో డీపీఓ పర్యవేక్షణలో ఇద్దరు ఎంపీఓలు, 30 మంది పంచాయతీ కార్యదర్శులు, 10 మంది కారోబార్‌లను నియమించారు.

రోజుకు రెండు షిఫ్టులు..
మేడారం జాతరలో పారిశుద్ధ్య సేవలను 400 మంది కార్మికులను ప్రత్యేకంగా నియమించనున్నారు. ఇప్పటికే వందల సంఖ్యలో కార్మికులు మేడారంలో పారిశుద్ధ్య సేవలు చేపడుతున్నారు. జాతర ప్రారంభం నాటికి మొత్తం 400 మంది పారిశుద్ధ్య కార్మికులను రాజమండ్రి నుంచి ప్రత్యేకంగా రప్పించనున్నారు. వీరు ఈ 21 సెక్టార్లలో రోజుకు రెండు షిఫ్టుల వారీగా పనులు చేయనున్నారు. ఈసారి మినీ జాతరలో ఎక్కడి చెత్త అక్కడే సేకరించి ఒక దగ్గర వేసేందుకు గ్రీన్ మ్యాట్‌తో ఒక మినీ డంపింగ్ కేంద్రం లాగా ఏర్పాటు చేశారు. జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో భక్తుల తాగునీటి వసతి కోసం ప్రత్యేకంగా 10 వాటర్ ట్యాంకర్లను కూడా అందుబాటులో ఉంచనున్నారు. శానిటేషన్ ప్రాంతాలు, భక్తులు విడిది చేసే ప్రదేశాల్లో ఎక్కడా కూడా చెత్త, దోమలు, ఈగలు నిల్వకుండా కార్మికులు ఎప్పటికప్పుడు తొలగించి బ్లీచింగ్ చేసేలా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అలాగే మేడారంలోని రోడ్లపై దుమ్ము, దూళి లేవకుండా ట్యాంకర్లతో రోడ్లపై నీళ్లు చల్లుతున్నారు. భక్తుల విడిది చేసే తాగునీటి వసతితో పాటు మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచేందుకు కార్మికులను ప్రత్యేకంగా నియమించారు.

పక్కా ప్రణాళికతో పనులు



మేడారం సమ్మక్క సారలమ్మ మినీ జాతరలో పారిశుద్ధ్య పనులకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం. జాతరకు ముందస్తుగా 10 రోజుల నుంచి పనులు చేపడుతున్నాం. జాతర సమయంలో ఎలాంటి పారిశుద్ధ్య సమస్య ఏర్పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాం. గత రెండు జాతరల్లో ములుగు డీఎల్‌పీఓగా పనిచేసిన అనుభవంతో పారిశుద్ధ్య పనుల్లో లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం. మంత్రి సీతక్క, కలెక్టర్ ఆదేశాల మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేస్తాం.

- దేవరాజ్, డీపీఓ

జూనియర్ VS సీనియర్

- కొట్టుకున్న ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సు విద్యార్థులు
- కాకతీయ యూనివర్సిటీలో ఉద్రిక్తత
- సీనియర్లకు గౌరవం ఇస్తలేరనే కారణంతో గొడవ?
- కామన్‌మెస్‌లో ఒకసారి, హాస్టల్ వద్ద మరోసారి ఘర్షణ
- ఇద్దరు జూనియర్లను ఎంజీఎం ఆస్పత్రికి తరలింపు
- పోలీసుల అదుపులో 18మంది విద్యార్థులు
- నేడు వీసీతో చర్చించి చర్యలు తీసుకునే అవకాశం


కేయూ కామన్‌మెస్‌లో కొట్టుకుంటున్న విద్యార్థులు


గణపతి దేవ హాస్టల్ ప్రాంతంలో రిజిస్ట్రార్ రాంచంద్రం, ప్రిన్సిపాల్ సురేష్‌లాల్, హాస్టళ్ల డైరెక్టర్ రాజ్‌కుమార్‌తో చర్చిస్తున్న పోలీసులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ హాస్టళ్లలో ఉండే కొందరు విద్యార్థులు క్రమశిక్షణ తప్పుతున్నారు. ఇటీవల రెండు సంఘటనల్లో పలువురు విద్యార్థులను హాస్టళ్లనుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలు మరిచిపోకముందే తాజాగా శుక్రవారం కామన్ మెస్‌లో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సు సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. భోజనం చేస్తున్న సమయంలోనే విద్యార్థులు పరస్పరం దాడి చేసుకున్నారు. భోజనం ప్లేట్లు, గిన్నెలను కిందపడేశారు. ఆ సమయంలో మిగతా విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. ఎందుకు కొట్టుకుంటున్నారో తెలియక అయోమయానికి గురయ్యారు.

సాయంత్రం మరోసారి ఘర్షణ..
క్యాంపస్‌లోని పీహెచ్‌సీలో చికిత్స పొందిన ఇద్దరు జూనియర్లు సాయంత్రం గణపతిదేవ హాస్టల్‌కు వచ్చారు. ఆ తరువాత ఏమి జరిగిందో తెలియదు.. జూనియర్లకు, సీనియర్లకు మధ్య మళ్లీ ఘర్షణ మొదలైంది. సీఐ రవికుమార్, ఎస్సై మాధవ్ ఇతర పోలీస్‌సిబ్బంది అక్కడి చేరుకొని ఇరువర్గాలకు చెందిన 18 మంది విద్యార్థులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తొలుత కామన్‌మెస్‌లో దెబ్బలు తగిన ఇద్దరు జూనియర్లను వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

హాస్టళ్ల డైరెక్టర్ ఏమంటున్నారంటే..
తమకు గౌరవం ఇస్తలేరనే కారణంతోనే సీనియర్ విద్యార్థులు.. జూనియర్లతో గొడవ పడినట్లు హాస్టళ్ల డైరెక్టర్ రాజ్‌కుమార్ చెబుతున్నారు. మొదట 'నావైపు ఎందుకు చూస్తున్నావు' అని ఓ సీనియర్.. జూనియర్ విద్యార్థిని ప్రశ్నించగా.. మాటమాట పెరిగి పరస్పరం కొట్టుకున్నారని తెలిపారు. అదే కారణమా? మరేదైనా ఉందా అనే కోణంలో విచారించాల్సి ఉందని చెబుతున్నారు. తమను సీనియర్లు కొట్టారని ముగ్గురు జూనియర్లు, జూనియర్లే కొట్టారని ముగ్గురు సీనియర్ విద్యార్థులు తమ దృష్టికి తెచ్చినట్లు రాజ్‌కుమార్ తెలిపారు.

నేడు వీసీ వచ్చాక నిర్ణయం
ఘర్షణ విషయాన్ని హైదరాబాద్‌లో ఉన్న వీసీ కె.ప్రతాప్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా యూనివర్సిటీలోనే ఉన్న రిజిస్ట్రార్ రామచంద్రం, కెమిస్ట్రీ విభాగం అధిపతి, యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ దృష్టికి కూడా తీసుకెళ్లారు. శనివారం వీసీ వచ్చాక పోలీసులకు ఫిర్యాదు చేయాలని యోచిస్తున్నారు. అదేవిధంగా విద్యార్థులపై ఎటువంటి చర్యలు తీసుకోవాలనేది సమావేశమై నిర్ణయించనున్నట్లు సమాచారం. హాస్టల్‌నుంచి సస్పెండ్ చేయాలా.. ఒక సెమిస్టర్ మొత్తం సస్పెండ్ చేయాలనేది ఆలోచన చేస్తున్నారు. కామన్ మెస్‌లో ప్లేట్లు, గిన్నెలు పడేయడంతో జరిగిన నష్టం ఎంత అనేది కూడా అంచనా వేస్తున్నారు. సీసీ ఫుటేజీలు కూడా పరిశీలించాలని యూనివర్సిటీ అధికారులు యోచిస్తున్నారు. ఎవరెవరి మీద ఎవరు దాడి చేసుకున్నారనేది స్పష్టంకానుంది.

కేసు నమోదు
కొట్టుకున్న విద్యార్థులను కేయూ పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు సీనియర్లు 8 మంది, జూనియర్లు 10మంది, నలుగురు ఏబీవీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆధిపత్యం కోసమేనా..

ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సు సీనియర్లు తమకు జూనియర్లు గౌరవం ఇవ్వడం లేదని కొంతకాలంగా గుర్రుగా ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం కామన్‌మెస్‌లో అందరూ భోజనం చేస్తున్నారు. ఏమి జరిగిందో తెలియదు.. ఒక్కసారిగా జూనియర్లకు, సీనియర్లకు మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఇరువర్గాలు కొట్టుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సమాచారం తెలుసుకున్న హాస్టళ్ల డైరెక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, కేయూ పోలీస్‌స్టేషన్ ఎస్సై మాధవ్ తన పెట్రోలింగ్ సిబ్బందితో కామన్‌మెస్‌కు చేరుకున్నారు. దెబ్బలు తాకిన ఇద్దరు జూనియర్లను క్యాంపస్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. ఘర్షణకు దారితీసిన పరిస్థితులను పోలీసులు అక్కడి సిబ్బంది, విద్యార్థులను, హాస్టళ్ల డైరెక్టర్ రాజ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.

ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరగాలి

అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ



ములుగు: వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని డిప్యూటీ ఎన్నికల అధికారి, అడిషనల్ కలెక్టర్ సీహెచ్ మహేందర్‌జీ అధికారులను సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన అవగాహన శిక్షణ శిబిరంలో అడిషనల్ కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల కమిషన్ మేరకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుందన్నారు. పోలింగ్ ముందు ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్స్‌లను తెరిచి చూపించాలన్నారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసుశాఖ తరఫున తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, తహసీల్దార్ విజయభాస్కర్, సూపరింటెండెంట్ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి
ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ సూచించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అడిషనల్ కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. నులిపురుగుల నివారణను అన్ని శాఖల అధికారులు బాధ్యతగా స్వీకరించాలన్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ గోపాల్‌రావు మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ నుంచి 17వ తేదీ వరకు 1 నుంచి 19 సంవత్సరాలు ఉన్న 73,244 మంది చిన్నారులకు మాత్రలను పంపిణీ చేస్తున్నామన్నారు. వైద్య సిబ్బంది నిబంధనల మేరకు నడుచుకోవాలని సూచించారు.

కుష్ఠువ్యాధి నిర్మూలన అందరి బాధ్యత


మాట్లాడుతున్న డీపీఎంఓ సంజీవరావు

ఎస్ఎస్ తాడ్వాయి: కుష్ఠువ్యాధి నిర్మూలన అందరి బాధ్యతని డీపీఎంఓ సంజీవరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పర్శలేని మొద్దుబారిన మచ్చలను గుర్తించినట్లయితే వెంటనే ప్రభుత్వ పీహెచ్‌సీలో వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హెచ్ఎం రేవతి, ప్రిన్సిపాల్ సుహాసిని పాల్గొన్నారు.

రామప్పను సందర్శించిన శ్రీలంక టూరిస్టులు


శ్రీదుర్గ అలంకరణలో రామలింగేశ్వరస్వామి


ఆలయ విశిష్టతను వివరిస్తున్న గైడ్ విజయ్‌కుమార్

వెంకటాపురం(ఎం)/గోవిందరావుపేట: ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప దేవాలయాన్ని శుక్రవారం శ్రీలంకకు చెందిన 15 మంది టూర్ ఆపరేటర్స్ సందర్శించారు. తెలంగాణ పర్యాటక శాఖ, శ్రీలంక ఎయిర్‌లైన్స్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలైన నాగర్జునసాగర్, నేలకొండపల్లి, బుద్ధవనం, వరంగల్ కోట, భద్రకాళి, వేయిస్తంభాల గుడిని సందర్శించారు. పర్యటనలో భాగంగా శుక్రవారం రామప్ప ఆలయం, లక్నవరం సరస్సులను సందర్శించారు. రామప్ప రామలింగేశ్వరస్వామిని వారు దర్శించుకోగా ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. ఆలయ విశిష్టత గురించి గైడ్ విజయ్‌కుమార్ వివరించగా ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీలంక నుంచి తెలంగాణలోని పర్యాటక ప్రదేశాలకు త్వరలో టూర్లను కండక్ట్ చేసేందుకు పర్యాటక ప్రదేశాలను సందర్శిస్తున్నామన్నారు. అనంతరం రామప్ప సరస్సును సందర్శించి సరస్సులో బోటింగ్ చేశారు. లక్నవరం సరస్సు ఎంతో ఆహ్లాదాన్ని ఇచ్చిందన్నారు. వారి వెంట టూరిజం అధికారులు సాయిరాం, శ్రీనాథ్‌లు ఉన్నారు. అదేవిధంగా క్రొయేషియా దేశానికి చెందిన పీటర్ సందర్శించారు. శుక్రవారం సందర్భంగా రామలింగేశ్వరస్వామిని శ్రీ దుర్గ అవతారంలో అలంకరించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు హరీష్‌శర్మ తెలిపారు.

స్థానిక సమరానికి సిద్ధంగా ఉండాలి

- విబేధాలు వీడి సమన్వయంతో పనిచేయాలి
- పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మంగపేట: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. మండలంలోని బోరునర్సాపురంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీలో నెలకొన్న పరిస్థితులపై సీతక్కకు వివరించారు. మొదటి నుంచి పార్టీ అభివృద్ధికి పాటుపడిన వారికి ప్రాధాన్యం లేకపోవడంతో అసంతృప్తి నెలకొందని సయ్యద్‌హుస్సేన్ మంత్రికి వివరించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకుల మధ్య ఎలాంటి విబేధాలు ఉన్నా తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ, మండల నాయకులు ప్రత్యేక ప్రణాళికతో పనిచేసి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ పటేల్, మహిళా విభాగం అధ్యక్షురాలు రేగ కల్యాణి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇస్సార్‌ఖాన్, కర్రి నాగేంద్రబాబు, యానయ్య, వెంకటేశ్వర్లు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ పరిశీలన


ఏటూరునాగారంలో సెంట్రల్ లైటింగ్

ఏటూరునాగారం: ఏటూరునాగారం మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్ నుంచి వై జంక్షన్ వరకు నూతనంగా నిర్మించిన సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను శుక్రవారం రాత్రి మంత్రి పరిశీలించారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి లైట్లు వెలుగుతున్న స్తంభాలను చూస్తూ పాదయాత్ర చేశారు.

అనాథ కవలలకు వివాహం



నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న గాదె ఇన్నయ్య దంపతులు

జఫర్‌గఢ్: అమ్మలా ఆదరించిన అనాథాశ్రమం.. పెళ్లి వేడుకలతో సందడిగా మారింది. అనాథ కవలలకు వైభవంగా పెళ్లి చేసి అమ్మానాన్నలేని లోటును తీర్చారు 'మా ఇల్లు' ఆశ్రమ నిర్వాహకులు గాదె ఇన్నయ్య పుష్ప దంపతులు. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం రేగడితండా గ్రామ శివారు టీబీతండాలో ఇన్నయ్య దంపతులు ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. విజేత, శ్వేత అనే కవలలు అమ్మానాన్నలను కోల్పోవడంతో 2009లో ఈ ఆశ్రమంలో చేరారు. వీరిని పెద్ద చేసి, విద్యాబుద్ధులు నేర్పారు. శ్వేత ఎల్‌ఎల్‌బీ పూర్తి చేయగా, విజేత బీఈడీ పూర్తి చేసింది. వీరికి ఇన్నయ్య దంపతులు పెళ్లి సంబంధాలు చూసి శుక్రవారం ఆశ్రమంలో ఘనంగా వివాహం జరిపించారు. ఈ వేడుకలకు వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేలు నాగరాజు, నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్‌తోపాటు వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

భార్యను హత్య చేసిన భర్తకు జైలు

వరంగల్ లీగల్ : మద్యానికి బానిసై తాగడానికి డబ్బులు ఇవ్వలేదని కట్టుకున్న భార్యను కర్రలతో తలపై కొట్టి చంపిన నేరానికి హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామానికి చెందిన ఆలకుంట రాజుకు ఎనిమిది సంవత్సరాల కఠిన జైలుశిక్ష విధిస్తూ హనుమకొండ రెండో అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సిహెచ్ రమేష్‌బాబు శుక్రవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామానికి చెందిన వల్లెపు మల్లయ్య కుమార్తె గట్టమ్మను అదే మండలం నారాయణగిరి గ్రామానికి చెందిన ఆలకుంట రాజుకు 2000 సంవత్సరంలో వివాహం చేశారు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. మద్యానికి బానిసైన రాజు డబ్బుల కోసం తరచూ భార్య గట్టమ్మను వేధించేవాడు. ఓసారి తీవ్రంగా కొట్టడంతో పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించుకున్నారు. అనంతరం బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లినా.. రాజు ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ క్రమంలో కుటుంబ సమేతంగా వేములవాడ జాతరకు వెళ్లేందుకు రమ్మని గట్టమ్మ తల్లిదండ్రులను పిలిచింది. తండ్రి వల్లెపు మల్లయ్య తను రాలేనందున కూతురుకు కొంత డబ్బు ఇచ్చాడు. వేములవాడలో తాగడానికి డబ్బులు కావాలని రాజు భార్య గట్టమ్మను అడగ్గా.. ఇంటికి వెళ్లిన తర్వాత ఇస్తా దేవుని వద్ద తాగొద్దని చెప్పింది. జాతర నుంచి వచ్చిన తర్వాత గట్టమ్మ డబ్బులు ఇవ్వలేదు. దీంతో 2019 ఆగస్టు 7న మద్యం సేవించి వచ్చిన రాజు భార్య గట్టమ్మతో గొడవపడ్డాడు. కోపంతో మంచం పట్టె కర్రలతో గట్టమ్మ తలపై విపరీతంగా కొట్టాడు. స్పృహ తప్పి రక్తమడుగులో ఉన్న గట్టమ్మ మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడు తీసుకొని పారిపోయాడు. స్కూల్ నుంచి వచ్చిన పెద్దకుమారుడు ఆలకుంట రమేశ్ రక్తమడుగులో ఉన్న తల్లిని చూసి భయంతో సమీప గ్రామమైన ముప్పారానికి వెళ్లి అమ్మమ్మ, తాతలకు విషయం చెప్పాడు. వారు వచ్చి చూడగా గట్టమ్మ మృతి చెంది ఉంది. అల్లుడు రాజు ఆచూకీ తెలియలేదు. మల్లయ్య ఫిర్యాదు మేరకు ధర్మసాగర్ పోలీసులు రాజుపై కేసు నమోదు చేశారు. ఈక్రమంలో తన భార్య చనిపోయిందని, పోలీసులు తన గురించి గాలిస్తున్నారని తెలిసి రాజు.. గ్రామ పెద్దల ద్వారా ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. విచారణలో సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు నేరం రుజువుకావడంతో రాజుకు శిక్ష విధిస్తూ వెల్లడించింది. పోలీసు అధికారులు షాదుల్లా బాబా, ప్రవీణ్‌కుమార్ కేసును పరిశోధించగా లైజన్ ఆఫీసర్ పరమేశ్వరి పర్యవేక్షణలో కానిస్టేబుల్స్ అశోక్, రమేశ్, సుధాకర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీందర్ రావు కేసు వాదించారు.

ఆధ్యాత్మిక శిఖరం.. కాళేశ్వరం

వైభవంగా ప్రారంభమైన మహాకుంభాభిషేకం

తొలిరోజు గోమాత పూజ



స్వామివారి గర్భగుడిలో మహారుద్రం పఠిస్తున్న పండితులు



గోమాతకు పూజ చేస్తున్న పండితులు

- గర్భగుడి, అమ్మవారి ఆలయాల్లో ఆవర్తన పఠనాలు
- మార్మోగిన కాళేశ్వరం

కాళేశ్వరం: మహాకుంభాభిషేక ఘట్టం వైభవంగా ప్రారంభమైంది. సంప్రోక్షణ పూజలతో కాళేశ్వరాలయానికి ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు శుక్రవారం ఉదయం గోదావరి జలాలను ఐదు కలశాలతో వేదపండితులు కాళేశ్వరం దేవస్థానానికి తీసుకొచ్చారు. గోపూజ, గణపతి పూజతో వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఉత్సవాలను దేవాదాయశాఖ అధికారులు ప్రారంభించారు. అచ్చలాపురానికి చెందిన అవధాని దుద్దిళ్ల మనోహరశర్మ ఆధ్వర్యంలో 50 మంది రుత్వికులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రత్యేక ఆవర్తనాలు

శతచండి మహారుద్ర సహిత సహస్ర ఘటాభిషేకం, కుంభాభిషేకం పూజలను చేశారు. కాళేశ్వరం ప్రధాన ఆయలంలో అనివెట్టి మండపంలో ఏర్పాటు చేసిన 1,180 కలశాలకు ఆలయ ప్రధాన అర్చకుడు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ–రాణి దంపతుల ఆధ్వర్యంలో కలశ పూజ, హోమం నిర్వహించారు. కాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయం, శుభానందదేవి ఆలయాల్లో రుత్వికులు 1,331 ఆవర్తనాలను పఠించారు. యాగశాలలో పూజాతంతు నిర్వహించారు.

మార్మోగిన కాళేశ్వరం..

42ఏళ్ల తర్వాత మహాకుంభాభిషేకం నిర్వహిస్తుండడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తజనం తరలివస్తున్నారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలతో కాళేశ్వరం మార్మోగింది. అచ్చలాపురం రుత్వికులతోపాటు స్థానిక పండితులు పూజలతో ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తుంది. ఆలయంలో అభిషేకాలు లేకపోవడంతో భక్తులు దర్శనం చేసుకొని వెళ్లిపోతున్నారు. ఇదిలా ఉండగా.. కాళేశ్వరాలయానికి వచ్చే భక్తులు, విధులు నిర్వర్తిస్తున్న స్వచ్ఛంద సంస్థలు, వివిధశాఖ అధికారులకు సిబ్బందికి దేవస్థానం ఈఓ మహేష్ ఆధ్వర్యంలో పులిహోర ప్రసాదం, మధ్యాహ్నం అన్నదానం చేశారు.

నేడు పీఠాధిపతి రాక..

నేడు(శనివారం) మధ్యాహ్నం తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానందసరస్వతి కాళేశ్వరం రానున్నారు. ఆయన కోసం త్రివేణి గెస్ట్‌హౌస్‌లో విడిది ఏర్పాటు చేశారు. ఆయన పూజ విధానం కోసం శ్రీరాజరాజేశ్వర వసతి గృహంలో భక్తుల సౌకర్యార్థం ప్రవచనాల కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం ఆయన చేతుల మీదుగా మహాకుంభాభిషేకం ఘట్టం 10.42గంటలకు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

బందోబస్తు..

ఎస్పీ కిరణ్‌ఖరే ఆధ్వర్యంలో పోలీసుశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎలాంటి ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకుంటుంది. సుమారు 200 మంది పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల రద్దీ పెరిగితే మరింత బందోబస్తు పెంచనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

కాళేశ్వరం దేవస్థానంలో మహాకుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా ప్రారంభమైనట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. కాళేశ్వరం ఆలయంలో కలెక్టర్‌తోపాటు కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ శుక్రవారం పర్యటించారు. 9వ తేదీ ఆదివారం మహా కుంభాభిషేకం ముగింపు కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని, రద్దీకి తగినట్లు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. గోదావరి నదిలో స్నాన ఘట్టాలను పరిశీలించారు. భక్తుల వాహనాలు కేటాయించిన పార్కింగ్ ప్రాంతాలకు మళ్లించాలని కలెక్టర్ ఆదేశించారు. 70 మంది పారిశుద్ధ్య కార్మికులతో ప్రత్యేక పరిశుభ్రత చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వ్యర్థాల తరలింపునకు 2 ట్రాక్టర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర వైద్య



తాగునీరు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

సేవలకు మహాదేవపూర్ కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో బెడ్లు కేటాయించినట్లు తెలిపారు. గోదావరి వద్ద గజ ఈతగాళ్లు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో డీపీఓ నారాయణ రావు, మండల ప్రత్యేక అధికారి వీరభద్రయ్య, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, దేవస్థానం ఈఓ మహేశ్, డీఈఈలు సాయిలు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

- ఎన్పీడీసీఎల్ పరిధిలో 5,328 మెగావాట్లకు చేరుకున్న వినియోగం
- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: ఎండల తీవ్రత, యాసంగి పంటల సాగు గణనీయంగా పెరగడంతో విద్యుత్ వినియోగం పెరుగుతుందని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి డైరెక్టర్లు, ఎన్పీడీసీఎల్ పరిధిలోని అన్ని సర్కిళ్ల సూపరింటెండెంట్ ఇంజనీర్లు, చీఫ్ ఇంజనీర్లు, నోడల్ అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలు, డివిజన్ల వారీగా విద్యుత్ సరఫరా పరిస్థితిని, అభివృద్ధి పనులు, వేసవి కార్యాచరణపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సీఎండీ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 6న రాష్ట్రంలో అత్యధికంగా 15,752 మెగావాట్లు, ఎన్పీడీసీఎల్‌లో 5,328 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ పెరిగిందన్నారు. ప్రతి ఏటా మార్చిలో పెరిగే డిమాండ్ ఈ ఏడాది ఫిబ్రవరిలోనే పెరిగిందన్నారు. ఫిబ్రవరి నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో పాటు పంటల సాగుకు భూగర్భజలాల వినియోగానికి



మాట్లాడుతున్న వరుణ్ రెడ్డి

విద్యుత్ వినియోగం పెరగడంతో విద్యుత్ డిమాండ్ పెరుగుతుందన్నారు. ఈ క్రమంలో అధికారులు ఎంతో జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలన్నారు. మార్చిలో మరింత లోడ్ పెరిగే అవకాశం ఉందని, దీనికి అనుగుణంగా వేసవి కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా ఇంటర్ లింకింగ్ లైన్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు పురోగతి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు, నిర్వహణ వేగంగా చేయాలన్నారు. లోడ్ పెరిగే అవకాశం ఉన్న ఫీడర్లలో లోడ్ బదలాయింపు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు అశోక్ కుమార్, టి.సదర్‌లాల్, సీఈ బీకం సింగ్, జీఎంలు అన్నపూర్ణ, నాగప్రసాద్, గౌతమ్ రెడ్డి, అంకుశ్, డీ.ఈ లు అనిల్ కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరిట మోసం

- టాస్క్ పూర్తి చేయాలన్న సైబర్ నేరగాళ్లు
- రూ.5.90 లక్షలు నష్టపోయిన యువరైతు

మహబూబాబాద్ రూరల్ : సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మి ఓ విద్యావంతుడైన యువరైతు ఆర్థికంగా నష్టపోయిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువ రైతు డిగ్రీ పూర్తిచేసి వ్యవసాయం చేస్తున్నాడు. గతేడాది సెప్టెంబర్ 11వ తేదీన అతడికి ఫోన్‌కు ఆన్‌లైన్ ద్వారా జాబ్ కావాలా..? అంటూ ఓ లింకు వచ్చింది. ఆ లింకును ఓపెన్ చేసి టాస్క్ ఆడమని చెప్పగా అవతలి వ్యక్తులు ఇచ్చిన టాస్క్‌ను ఓపెన్ చేశాడు. ప్రతి టాస్కు రెండు గంటలకు రూ.150 చొప్పున పెద్ద మొత్తంలో డబ్బులు వస్తాయని అవతలి వ్యక్తులు నమ్మించారు. అది నమ్మిన సదరు యువరైతు దశలవారీగా రూ.90 వేల నగదును తన ఫోన్ పే నుంచి, మరో రూ.5 లక్షలను బ్యాంకు ఖాతా నుంచి ఆన్లైన్ జాబ్ ఇస్తామని చెప్పిన వ్యక్తుల ఖాతాలకు బదిలీ చేశాడు. రెండు మూడు రోజుల పైబడి తను పెట్టుబడి పెట్టిన డబ్బులను ఇవ్వమని అడగగా ఎదురు వ్యక్తులు స్పందించకపోవడంతో తాను సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయానని గుర్తించాడు. ఆ వెంటనే సైబర్ క్రైమ్ 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. కొద్దిరోజుల తర్వాత రూ.63 వేలు తన ఖాతాకు వచ్చినట్లు చూపించినప్పటికీ డ్రా కావడంలేదు. దీంతో తనకు న్యాయం చేయాలని కోరుతూ బాధితుడు మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు.

నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తుల స్వాధీనం

- మహదేవపూర్‌లో సీసీఎస్ పోలీసుల మెరుపుదాడి

కాళేశ్వరం: నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులను రవాణా చేస్తున్న గూడ్స్ వాహనాన్ని సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. మహదేవపూర్ ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం కాటారం వైపు నుంచి మహదేవపూర్‌కు తరలి వస్తున్న గూడ్స్ వాహనంలో పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన వేల్పుల సంతోష్, షేక్ పర్వేజ్‌లు కలిసి నిషేధిత గుట్కా, అంబర్, పొగాకు ఉత్పత్తులను రవాణా చేస్తు పట్టుబడ్డారు. వారిని పోలీసులు విచారించగా గోదావరిఖనికి చెందిన చిదిరాల నాగరాజు వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి లాభాల కోసం గత కొన్నేళ్లుగా వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. పట్టుకున్న గుట్కా, అంబర్, పొగాకు ఉత్పత్తుల విలువ రూ.7.92 లక్షల వరకు ఉంటుందని ఎస్సై తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ జే.శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వాహనాన్ని, ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



మహదేవపూర్‌లో పట్టుకున్న వ్యాన్, నిందితులతో పోలీసులు

ఎఫ్‌పీయూ ఎస్సై శివకుమార్‌కు కేంద్ర ట్రోఫీ

మహబూబాబాద్ రూరల్ : జిల్లా పోలీసు శాఖ పరిధిలోని ఫింగర్ ప్రింట్ యూనిట్ ఎస్సై ఈద శివకుమార్ కేంద్ర స్థాయిలో ఖాన్ బహదూర్ అజీజుల్ హక్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఢిల్లీలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ ఈ ట్రోఫీని అందజేశారు. సెంట్రల్ ఫింగర్ ప్రింట్ బ్యూరో రాష్ట్రాల్లోని ఫింగర్ ప్రింట్ బ్యూరో విభాగాల్లో నియామకులైన పోలీసు అధికారులు, సిబ్బందికి నిర్వహించే ఆల్ ఇండియా బోర్డు పరీక్షల్లో శివకుమార్ ప్రథమ స్థానంలో నిలిచారు. న్యూఢిల్లీ నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో, సీఎఫ్‌పీబీ ఆధ్వర్యంలో జనవరి 30, 31వ తేదీల్లో 25వ అఖిల భారత ఫింగర్ ప్రింట్ బ్యూరో నిర్దేశకుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నేరపరిశోధన విభాగ డీజీపీ శిఖా గోయల్, ఫింగర్ ప్రింట్ బ్యూరో డైరెక్టర్ ఎండీ తాతారావు, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఎస్సై శివకుమార్‌ను అభినందించారు.

అక్కకు ఆలయం..

- 20 ఏళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయిన అచ్చమ్మబాయి
- స్మారకంగా ఆలయం నిర్మించి అనుబంధాన్ని చాటుకున్న సోదరులు



అచ్చమ్మబాయి విగ్రహం



జర్పులతండాలో అచ్చమ్మబాయి ఆలయం

మరిపెడ రూరల్: అక్క చనిపోయి 20 ఏళ్లయింది. ఆమె స్మారకంగా సోదరులు ఆలయం కట్టించి అందులో ఆమె విగ్రహాన్ని ప్రతిష్ఠించి తమ తోడబుట్టిన అనుబంధాన్ని చాటుకున్నారు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బీచ్‌రాజుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని జర్పులతండాలో శుక్రవారం చోటు చేసుకుంది. జర్పులతండాకు చెందిన జర్పుల బాలు – లక్ష్మీ దంపతులకు ఐదుగురు సంతానం. వీరిలో ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. పెద్దకుమార్తె అచ్చమ్మబాయి అనారోగ్యంతో 20ఏళ్ల క్రితం చనిపోయింది. ఆమెపై ఉన్న మమకారంతో తండా శివారులో చిన్న ఆలయం నిర్మించి కుటుంబ సభ్యులు నిత్యం పూజలు చేసేవారు. అనంతరం ఆమె ఇద్దరు సోదరులు రంగానాయక్, మోహన్‌నాయక్‌లు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. సోదరిని దేవతగా పూజిస్తున్న వారు అనుకున్నట్లుగా రూ.20 లక్షలతో గుడిని నిర్మించి అచ్చమ్మబాయి విగ్రహాన్ని శుక్రవారం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రతిష్ఠించి పూజలు చేశారు.

కళలు.. సంస్కృతికి జీవం



వీణ వాయిస్తున్న యువకుడు



నృత్యం చేస్తున్న కళాకారులు

- కళలకు నిలయం విద్యారణ్య కళాశాల
- కాళోజీ కళాక్షేత్రంలో ఘనంగా స్వర్ణోత్సవం
- కళాకారుల ప్రదర్శనలు

హన్మకొండ కల్చరల్ : కళలు.. సంస్కృతికి జీవం పోస్తాయని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. కళాశాల స్వర్ణోత్సవాల సందర్భంగా శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్ అధ్యక్షతన కళాశాల స్వర్ణోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ ప్రావీణ్య హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధీర్ కుమార్ మాట్లాడుతూ.. ప్రాచీన ఆచారాలు, కళలు, సంస్కృతి, సంగీత నృత్యాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. భద్రకాళి శేషు మాట్లాడుతూ వీణ, కచేరీ, సంగీత కళాకారుల సంఖ్య తగ్గిపోతున్న తరుణంలో నూతన కళాకారులను పోత్సహించే బాధ్యత సంగీత, నృత్య కళాశాల తీసుకోవడం అభినందనీయమన్నారు. అంతకు ముందుగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, భద్రకాళి శేషు, ప్రభుత్వ ప్రాక్టీసింగ్ స్కూల్ మ్యూజిక్ టీచర్ వద్దిరాజు నివేదిత, హైదరాబాద్, వరంగల్ కళాకారులతో కలిసి తాగ్యరాజు కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో అధ్యాపకులు భాస్కర్, అనుముల యోషు, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఓని విజయ్, గడ్డం శంకర్, విద్యార్థులు, సంగీత కళాకారులు పాల్గొన్నారు. వేడుకల్లో వేదికపై 500 మందికి పైగా సంగీతగాత్రం, వయోలిన్, సితార్, వీణా, కూచిపూడి, పేరిణి నృత్యం ఆకట్టుకున్నాయి.



మేడారంలో చలువ పందిళ్లు

- క్యూలో, గద్దె ప్రాంగణంలో ఏర్పాటు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చే భక్తులు ఎండ తగలకుండా దేవాదాయశాఖ ఆధ్వర్యంలో భక్తులు దర్శనానికి వెళ్లే క్యూలపై చలువ పందిళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఎండల తీవ్రత పెరగడంతో మినీ జాతరకు లక్షల సంఖ్యలో వచ్చే భక్తుల కోసం క్యూలతోపాటు, తల్లుల గద్దెల ప్రాంగణంలో చలువ పందిళ్లను ఏర్పాటు చేయనున్నట్లు దేవాదాయశాఖ అధికారులు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులు క్యూలో భక్తులకు తాగునీటి కోసం బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ ఏర్పాటు చేశారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు దేవాదాయశాఖ ఈఓ రాజేంద్రం తెలిపారు.

వనదేవతలకు భక్తుల మొక్కులు

సమ్మక్క– సారలమ్మలను దర్శించుకునేందుకు శుక్రవారం వేలాది మంది భక్తులు మేడారానికి తరలివచ్చారు. జంపన్నవాగు వద్ద స్నానఘట్టాలపై ఏర్పాటు చేసిన షవర్ల కింద స్నానాలు చేశారు. దేవతల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, ఎత్తు బంగారం, చీరసారె, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పగిడిద్దరాజు, గోవిందరాజులను దర్శించుకున్నారు. భక్తుల రద్దీతో గద్దెల ప్రాంగణం సందడిగా మారింది. మొక్కుల అనంతరం భక్తులు మేడారం పరిసర ప్రాంతాల్లో చెట్ల కింద విడిది చేసి వంటావార్పు చేసుకున్నారు. దేవాదాయశాఖ జూనియర్ అసిస్టెంట్లు జగదీశ్వర్, మధు, బాలకృష్ణ భక్తులకు సేవలందించి విరాళాలు సేకరించారు.



తడకలను కడుతున్న సిబ్బంది

వివాహ విందులో ఘర్షణ..

- నలుగురికి గాయాలు

పాలకుర్తి టౌన్: వివాహ వేడుకలో భోజనాల వద్ద బంధువులు రెండు వర్గాలుగా విడిపోయి కొట్టుకున్న ఘటన శుక్రవారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. జఫర్‌గఢ్ మండలంలోని ఓబులాపురం గ్రామానికి చెందిన సోల్తి వీరస్వామి, స్వరూప కూతురు.. రాయపర్తి మండలంలోని కేశవాపురం గ్రామానికి చెందిన తాళ్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్, ఉమ కుమారుడి వివాహవేడుకల్లో వివాదం చోటు చేసుకుంది. ఘర్షణ కుర్చీలతో కొట్టుకునేదాక వచ్చింది. మరికొంత మంది కుర్చీలను గాలిల్లోకి ఎగిరేశారు. వంట చేసే గరిటెలతో కొట్టుకున్నారు. దీంతో ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని బంధువులు పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అందులో ఒకరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలాన్ని పాలకుర్తి ఎస్సై పవన్‌కుమార్ సిబ్బందితో వెళ్లి సందర్శించారు. రెండు వర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు.

నూనె గింజల సాగు చేపట్టాలి

- జాతీయ ఆహార భద్రత మిషన్ కన్సల్టెంట్ సారంగం
- కృషివిజ్ఞాన కేంద్రంలో వృత్తి నైపుణ్య శిక్షణ

మామునూరు: నూనె గింజ పంటల సాగుపై రైతులు ప్రత్యేక దృష్టి సారిస్తే అధిక లాభాలు పొందవచ్చని జాతీయ ఆహార భద్రత మిషన్ కన్సల్టెంట్ సారంగం సూచించారు. ఖిలా వరంగల్ మండలం మామునూరు కృషివిజ్ఞాన కేంద్రం భవనంలో కేవీకే కోఆర్డినేటర్, సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న ఆధ్వర్యంలో ఐదో రోజు శుక్రవారం నూనె గింజల సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కజొన్న పంట యాజమాన్య పద్ధతులు, విత్తనాల శుద్ధి ప్రాముఖ్యత, ఎరువులు, నీటి యాజమాన్యాన్ని వివరించారు. అనంతరం ప్రదర్శన క్షేత్రాలను నిర్వహించి, నూతన వంగడాలు, సాంకేతికతను రైతులకు పరిచయం చేశారు. ఈ సమావేశంలో డాక్టర్ సీహెచ్ సౌమ్య, డాక్టర్ రాజు, డాక్టర్ సాయికిరణ్, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సారంగం

బుస్సాపూర్‌లో కారు బీభత్సం.. ఒకరి మృతి



ఇంట్లోకి దూసుకెళ్లిన కారు



నర్సిరెడ్డి (ఫైల్)

గోవిందరావుపేట: ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం బుస్సాపూర్ గ్రామంలో ఓ కారు బీభత్సం సృష్టించడంతో ఓ వ్యక్తి మృత్యువాతపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లికి చెందిన పలువురు శుక్రవారం లక్నవరం చూసేందుకు వెళ్తున్నారు. ఈక్రమంలో మండల పరిధిలోని బుస్సాపూర్ గ్రామంలో వారు ప్రయాణిస్తున్న కారును అతివేగంగా నడపడంతో అదుపుతప్పింది. దీంతో రోడ్డు పక్కనే ఉన్న నోబుల్‌రెడ్డి ఇంటి ఆవరణలోకి దూసుకెళ్లింది. ఈక్రమంలో ఇంటి ఆవరణలో కట్టెలు కొడుతున్న కట్ట నర్సిరెడ్డి(70)ని కారు బలంగా ఢీకొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. అప్పటికీ ఆగకుండా కారు నోబుల్‌రెడ్డి ఇంట్లోకి దూసుకెళ్లింది. దీంతో ఇల్లు పాక్షికంగా ధ్వంసం కావడంతోపాటు సామగ్రి చెల్లాచెదురైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులోని వ్యక్తులు కారును వదిలేసి పారిపోయారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య ధనమ్మ ఉంది. కొడుకు పది సంవత్సరాల క్రితం ఆత్మహత్య చేసుకోగా.. ప్రస్తుతం భర్త చనిపోవడంతో ధనమ్మ రోదనలతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి యువకుడు..



శ్రీనివాస్ (ఫైల్)

చిట్యాల: ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడు మృతి చెందిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా మాచవరం మండల కేంద్రానికి చెందిన చెవుల శ్రీనివాస్ (24) అనే యువకుడు రెండేళ్లుగా చిట్యాల మండలం కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాడు. పని నిమిత్తం మండల కేంద్రానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం స్థానిక సివిల్ ఆస్పత్రికి తరలించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి చిన్నమ్మ ఝాన్సీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. కాగా యువకుడి తల్లి నాలుగు నెలల క్రితం మృతి చెందినట్లు తెలిసింది.